

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు ' అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన ' రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజి కోసం ఎదురు చూసేలా ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# నిన్ను నిన్నుగా ప్రేమించుటకు.... .

కోర్టులో బోనులో నిలబడిన మాళవిక మొహంలో విచారం కారుమబ్బులా కమ్ముకుంది. దుఃఖం ముంచుకొచ్చింది. కన్నీరు నిండినందువలన పరిసరాలు మసక మసక గా కనిపిస్తున్నయి.

"నేరం చేసినట్లు ఒప్పుకుంటున్నావా ?" అని అడిగాడు న్యాయమూర్తి.

"ఒప్పుకుంటున్నాను ,,, ఒప్పుకుంటున్నాను ... ఒప్పుకుంటున్నాను...ఈ కోర్టులూ.. కేసులూ...విచారణలూ..జరిగిన విషయాలన్నీ తరచితరచి అడగటాలు, మానిపోతున్న గాయాన్ని పదేపదే రేపటాలూ ... ఈ నరక యాతన అనుభవించటం కన్నా చచ్చిపోవటం బెటర్... వీలున్నంత త్వరగా నన్ను ఉరితీయండి.. ప్లీజ్.." అన్నది మాళవిక.

"నీ బాధను నేను అర్థం చేసుకోగలను.. కానీ నా డ్యూటీ నేను చేయక తప్పదు." అన్నాడు న్యాయమూర్తి.

"డ్యూటి చెయ్యండి సార్ ... నా లాంటి బలి పశువు మీకు మళ్ళీమళ్ళీ దొరకదు. ఈటెల్లాంటి మాటలతొ కుళ్ళ బొడిచి మీ డ్యూటీ మీరు చెయ్యండి సార్" అంటూ ఆవేశంగా అరిచింది మాళవిక.

కేసు వాయిదా వేశాడు న్యాయమూర్తి. ఆమెను కోర్టు బోనులో నుంచి బయటికి తీసుకొచ్చినప్పుడు వరండా లో అర్జున్ కనిపించాడు. అతన్ని చూసి భోరున విలపించింది.

"బాధ పడకు. నేను సాయంత్రం వచ్చి కలుస్తాను. ." అన్నాడు అర్జున్.

మాళవిక వెళ్ళి వ్యాన్ లో కూర్చుంది. వ్యాన్ వెళ్ళి పోయింది.

సాయంత్రం అయిదు గంటలప్పుడు జైలు లోని ఫిమేల్ వార్డ్ వద్ద విజిటర్ల రూం లో కూర్చున్నాడు. మాళవిక వచ్చింది. ఆమె కోసం తెచ్చిన ఆపిల్ పళ్ళు ఇచ్చాడు. ఎంతో నిరాసక్తతో వాటి వంక చూసింది.

" బ్రతుకు మీద వ్యామోహం లేదు. జైల్ లోని తిండి తిని సగం చచ్చి పోయాను. కోర్ట్ లో అందరి ముందూ అడిగే వెధవ ప్రశ్నలకి సమాధానాలు చెప్పలేక మిగిలిన సగం చచ్చి పోయాను. ఇప్పుడు నేనో ప్రాణమున్న బొమ్మను. అంతే. ఎందుకు నాకీ పళ్ళు, ఫలాలూ ?" అని అడిగింది.

"లేదు. నువ్వు మళ్ళీ మామూలు మనిషి వి కావాలి. నిన్ను నేను ప్రేమిస్తున్నాను. నిన్ను విడిపించుకుంటాను..." అన్నాడు అర్జున్.

"భర్తను చంపిన పాతకిని. లోకం దృష్టిలో నేను చెసిన నేరం చాలా దారుణమైనది. చట్టం దృష్టిలో నేను హంతకురాలిని. జైలు గోడలు దాటి బయటకు రాలేను. రేపో మాపో నన్ను ఉరి తీస్తారు. ఇంత దురదృష్టం లోనూ నన్ను అభిమానించే మనిషి ఉన్నాడంటే, సమాధి మీద మొలిచిన మొక్క ఒక పువ్వు పూసినట్లుంది." అన్నది మాళవిక.

"నువ్వు నేరం చేసి నట్లు ఒప్పుకోవద్దు. నిన్ను నేను ఈ నేరం నుంచి తప్పిస్తాను. ఒకరిద్దరు లాయర్లను సంప్రదిస్తున్నాను. నువ్వు శిక్ష తప్పించుకునే వీలుంది. నువ్వు క్షేమంగా బయటకు వస్తావు..." అన్నాడు అర్జున్.

"బయటకు వచ్చినా హంతకిగా ముద్ర పడిన నన్ను ఈ లోకం బ్రతకనిస్తుందా ?"

"నీ మీద ఈగ వాలకుండా చూసుకునే బాధ్యత నాది" అన్నాడు అర్జున్.

మరి కొంత సేపు ఆమెకు ధైర్యం చెప్పి వెళ్ళి పోయాడు అర్జున్. మాళవిక సెల్ లోకి వెళ్ళింది.

కరకు రాతి గోడల మధ్య, ఇనుప కడ్డీల వెనుక, గాలీ వెలుతురూ రాని చిన్న గదిలో ఆమెకు ఎంతకీ నిద్ర రాదు. భయంకరమైన ఆలోచనలొస్తాయి.గతం తాలూకు నీడలు ... ఎంత వద్దన్నా కళ్ళ ముందు కదులుతుంటాయి.

తను కాలేజీకి వెళ్తుంటే ఒక మహారాణి విహారానికి వెళ్తున్నట్లు ఉండేది. తను రోడ్డు మధ్యలో నడుస్తుంటే ఇద్దరు కుర్రాళ్ళు ముందూ, ఇద్దరు కుర్రాళ్ళు వెనకాల స్కూటర్ల మీద ఫాలో అవుతుండే వారు. తను కాలేజ్ లో అడుగు పెడితే, అప్పుడె కాలేజ్ లో చేరిన నూనూగు మీసాల ఎదిగీ ఎదగని నూత్న యవ్వనం లోని కుర్రాడి దగ్గరనుంచీ, మనమరాలి వివాహం మొన్ననే చేసిన లెక్చరర్ వరహాల రావు దాకా అర విరిసిన నెలవంక లాంటి నవ్వుతో అదోలా అర్ధ వంతంగా చూసేవారు. తను క్లాస్ రూం లోకి అడుగు పెడితే "పగలు వెన్నెలగ మారినదేమి చెలీ" అని వెర్రెక్కిపోయిన కుర్రాళ్ళంతా కోరస్ లో పాటలు పాడేవారు.

తనకు కాలేజ్ బ్యూటి అనీ, మిస్ ఇండియా అనీ, మిస్ యూనివర్స్ అని బిరుదులు ఇచ్చేశారు. " ఈ సౌందర్య రాశి చేయి పట్టుకుని, ఏడు అడుగులు నడిచి, ఏడు పదుల పాటు సహ జీవనం చెయ్యాలంటే, ఎన్ని జన్మల పుణ్యం చేసుకోవాలో ..." అని అనుకున్న వాళ్ళూ ఉన్నారు.

ఇలాంటి పిల్ల కోడలిగా కావాలనీ, ఆ అమ్మాయి అడ్రసు కనుక్కొవాలనీ. వాళ్ళ వాళ్ళు పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నారేమో కనుక్కొమనీ, ఎంతో మంది ఆరాట పడ్డారు.

ఎవరూ తన కంటికి ఆనేవారు కాదు.

"నీకు ఎలాంటి వాడు కావాలో చెప్పు....వెతికి తీసుకు వస్తాను..." అన్నాడు మేనమామ ఒకసారి.

"నా పక్కన నిలబడ గల యోగ్యుడై ఉండాలి..." అన్నది.

"నాకు అర్థమై చావలేదు.." అన్నాడాయన.

"అందానికి అందం, చదువుకు చదువు, తెలివికి తెలివి, ధైర్యానికి ధైర్యం, ఉండి, నన్ను నన్నుగా ప్రేమించేవాడుగా ఉండాలి... " అన్నది తను.

"అన్ని సద్గుణాలున్న కల్యాణ గుణాభిరాముడు నీకు దొరికేదిలేదు.. నీకీ జన్మకు పెళ్ళి అయ్యేది లేదు..." అన్నాడాయన.

ఆయన అంచనా తప్పు అని ఆరు నెలల్లో తేలిపోయింది.

రిజిస్ట్రార్ రాజేశ్వర రావు ఆ ఊరికి కొత్తగా ట్రాన్స్ ఫర్ అయి వచ్చాడు. ఆయన కొడుకు అర్జున్ తొలిచూపులోనే ఆమెను ఆకట్టుకున్నాడు.

వయసు వచ్చినప్పటి నుంచీ ప్రతి ఆడపిల్లా తనకు తోడుగా ఉండే వ్యక్తి కోసం వెయ్యి కళ్ళతో వెతుకుతూ ఉంటుంది. ఎప్పుడో ఎవరి మీదనో దృష్టి నిలిచిపోతుంది. అక్కడి తో అన్వేషణ ఆగిపోతుంది.

అర్జున్ తో పరిచయం అయింది. క్రమంగా పరిచయం పెరిగి ఒంటరిగా కలుసుకునేదాకా వచ్చింది.

"నిన్ను చూసినప్పటి నుంచీ నీ గురించే ఆలోచిస్తూ నీ గురించి అన్ని విషయాలూ సేకరించాను..." అన్నాడు అర్జున్.

"నిన్ను చూసిన మరుక్షణం నుంచీ ఇంకేమీ అలోచించ లేదు. నీ ఒడిలో తల పెట్టుకుని పడుకోవాలని తప్ప..." అన్నది తను.

"కానీ మన పెళ్ళికి పెద్ద వాళ్ళు ఒప్పుకుంటారన్న నమ్మకం కలగటం లేదు..."

"ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోక పోయినా మన పెళ్ళి జరిగి తీరుతుంది..."

"పెద్దవాళ్ళను ఎదిరిస్తే మన జీవితాలు తుఫాను లో చిక్కున్న నావలు అవుతాయి..."

"నువ్వు నా పక్కన ఉంటె నా జీవిత నావ హార్బర్ లో ఉన్నట్లే... ఎన్ని తుఫాను లొచ్చినా ఫరవాలేదు..." అన్నది తను.

షరా మామూలే. తన తలిదండ్రులు ఒప్పు కోలేదు. తను అర్జున్ కలిసి పారి పోవాలని ప్లాన్ వేసుకున్నారు. కానీ అది ఇంట్లో వాళ్ళకు ఎలాగో తెలిసి పోయింది. చివరి క్షణంలో దొరికి పోయింది.

రెండు నెలలు తిరగక ముందే తనకు శ్యామలరావు తో అతి రహస్యంగా మేనమామ ఊరిలో పెళ్ళి జరిగి పోయింది. ముందుగా ఏ మాత్రం తెలిసినా అర్జున్ అడ్డుపడే వాడు. అందుకనే ఆమె పెళ్ళి వేరే ఊరిలో గొప్యంగా జరిగి పోయింది. తను మరొకరి భార్య అయిపోయింది.

"ఇప్పుడు నువ్వు మరొకరి భార్యవు. నిన్ను పరాయి స్త్రీ గా గౌరవించటం నా బాధ్యత. నువ్వు సుఖంగా ఉన్నంత కాలం నన్ను తలుచుకో వద్దు. నీకు ఏదన్నా కష్టం వచ్చినప్పుడు మాత్రం ఈ స్నేహితుడు ఉన్నాడన్న విషయం మరిచి పోవద్దు..." అన్నాడు అర్జున్.

తను గతాన్ని మరిచి పోయి కొత్త జీవితంతో రాజీ పడాలని నిర్ణయించుకుంది.

శ్యామల రావు ఒట్టి అనుమానం మనిషి.

"నువ్వు ఎవరినో ప్రేమించావటగా.. నాకు అంతా తెలిసిందిలే... అతను అందగాడా ? " అని అడిగాడు శ్యామల రావు.

ఒక రోజు తను అన్నం తింటుంటే అడిగాడు. "నువ్వు నీ ప్రియుడికి ముద్దలు కలిపి నోట్లో పెట్టే దానివా ? "

తను అన్నం తిన లేక పోయింది.

ఇంకో రోజు అడిగాడు " మీరు ఇద్దరూ లేచి పోవాలని ప్లాన్ చేసుకున్నారట కదా .. ఎక్కడికి పోవాలనుకున్నారు ? "

ఆ రోజు తను నిద్ర పోలేక పోయింది.

ఒకరోజు తను స్నానం చేసి ఇస్త్రీ చీర కట్టుకుని వస్తే "ఈ చీర నీ లవర్ కి బాగా ఇష్టమనుకుంటా ?" అని అడిగాడు.

తరువాత ఎప్పుడూ తను ఆ రంగు చీర కట్టు కోలేదు. ఒంటరిగా ఉంటే నీ ప్రియుడి గురించి ఆలోచిస్తున్నావా అని అడిగేవాడు. టి.వీలో సినిమా చూసినా, సీరియల్ చూసినా ఏ ప్రేమ సన్నివేశం వచ్చినా నీ ప్రియుడి తో ఇలాగే ఉండె దానివా ... అని అడిగేవాడు.

అనుక్షణం నీ ప్రియుడు ఇలా ఉండేవాడా, అలా ఉండేవాడా అంటూ మానసికంగా హింసించేవాడు. చివరకు అర్ధరాత్రి కూడా పక్కన చేరి నీ ప్రియుడు ఇలానా, అలానా ... అంటూ కుళ్ళబొడుస్తుంటే తట్టు కోలేక పోయింది.

జీవితం నరకం అయి పోయింది. చివరకు నలుగురి లోనూ సూటి పోటి మాటలతో హింసిస్తుంటే ఎదురు తిరిగింది. కోపంతో ఊగి పోయింది.

"అవును ... అతను నీకన్నా వెయ్యిరెట్లు, వెయ్యిరెట్లు ఉత్తముడు... అతని కాలి గోటికి కూడా నువ్వు పనికి రావు.." అని ఆవేశంతో ఊగి పోయి అరిచింది.

ఇక రోజూ యుద్ధమే...ప్రతి నిముషం, ప్రతి క్షణం పాత ప్రియుడిని గుర్తు చేసి ఈటేల్లాంటి మాటలతో పొడుస్తుంటే భరించలేక పోయింది. ఒక రోజు రాత్రి అడగరాని ప్రశ్నలతో మానసికంగా .క్షోభ పెడితే ఆవేశంతో పిచ్చిదై పోయి, అతని తలను గోడకేసి కొట్టి చంపేసింది.

తను హంతకురాలిగా మిగిలి పోయింది. భర్తను చంపిన మాట నిజమే. కానీ ఆయన కొన్ని నెలల పాటు తనని క్షణక్షణం మానసికంగా చంపేశాడు. అది గుర్తించేది ఎవరు ?

మాళవికను మర్నాడు మళ్ళీ కోర్టులో హాజరు పరిచారు.

"నువ్వు చెప్పుకోవలసింది ఏమైనా ఉందా ?" అని అడిగాడు న్యాయమూర్తి.

"వయసులో ఉన్నవాళ్ళకు తమ భవిష్యత్తు మీద ఎన్నో ఆశలు ఉంటయి. ఏవేవో కలలు కంటారు. ప్రేమించిన వ్యక్తిని పెళ్ళి చేసుకోవాలనుకుంటారు. పెద్ద వాళ్ళ దృష్టి లో అది క్షమించరాని నేరం. నాకు ఇష్టం లేని వ్యక్తితో మా వాళ్ళు పెళ్ళి జరిపించారు. అది వాళ్ళు చేసిన నేరం. పరిస్తితులతో రాజీ పడి బ్రతుకుదామనుకున్నాను. అలా కూడా నన్ను బ్రతక నివ్వ లేదు. నా భర్త అనుక్షణం నన్ను మానసికంగా హింసించి చంపేశాడు. అది అతను చేసిన నేరం. ఇన్ని నేరాలు కలిపితే నేను దోషిగా మిగిలాను. మీ ముందు దయనీయంగా నిలబడ్డాను. ఒకప్పుడు మహారాణీ లాగా వెలిగాను. నేను కోరుకున్నవేవీ నా అనుకున్న వాళ్ళే నాకు దక్క నివ్వలేదు. అందరూ అన్నిటికీ అడ్డుపడి నన్ను జైలు పాలు చేశారు. ... ఈ జీవితం నాకు అక్కర లేదు. నాకు మరణ శిక్ష విధించి ఇక నైనా నాకు విముక్తి కలిగించండి..." అన్నది మాళవిక.

న్యాయమూర్తి కేసు వాయిదా వేశాడు.

కోర్టు వరండాలో అర్జున్ కనిపించాడు. సాయంత్రం జైలు లో ఆమెను కలుసుకున్నాడు.

" ఐ లవ్ యూ" అన్నాడు ఆమె చేతిలో చెయ్యి వేసి.

" మనిద్దరి జీవితాలు కలవవు. కలవని ధ్రువాలను కలపాలని ఎందుకు వృధాగా శ్రమ పడతావు. ? నెలకో, ఆరు నెలలకో నన్ను ఉరి తీస్తారు. అప్పుడు ఉరి కంభం ఎక్క బోయే ముందు నిన్ను గుర్తు చేసుకుంటాను...నన్ను నన్నుగా ప్రేమించే వ్యక్తి ఒకరు ఉన్నారని...." అంటూ మాళవిక ఏడ్చింది.

అర్జున్ ఆమె కన్నీరు తుడిచాడు. అయినా ఆమె చెంపల మీద కన్నీరు వరదలై పారుతూనే ఉంది.

************** **************** **************

(వచ్చేనెల మరో కథ)

Click here to share your comments on this story.